
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 27 ఫిబ్రవరి 2025





కోటప్ప కొండ కింద భారీ విద్యుత్ ప్రభలు

ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు




కోటప్పకొండపై భక్తులు

శివాయ.. రుద్రాయ

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- త్రికోటేశ్వరస్వామికి నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కోటయ్యస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం
- కొలువుతీరిన 20 భారీ విద్యుత్ ప్రభలు..
- శివనామస్మరణతో మార్మోగిన అమరావతి, క్వారీ, గోవాడ, కాకాని

హరహర శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ రుద్రాయ.. చేదుకో కోటయ్య చేదుకో.. నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమ్రోగగా.. శివయ్య దర్శనాలతో భక్తులు తరించారు. బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలు, కోటయ్య తిరునాళ్లు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్త జన సందోహంతో కిటకిట లాడింది. త్రికూటాద్రిపై త్రికో టేశ్వర స్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి త్రికోటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పిం చడంతో ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామికి పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువున కొలువు దీరాయి. విద్యుత్ కాంతుల్లో ప్రభలు భక్తులకు కనువిందు చేయగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని అమరావతిలోని అమరేశ్వరాలయం, పెదకాకానిలోని మల్లికార్జునస్వామి వారి ఆలయం, క్వారీ, గోవాడ క్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వర స్వామి



కోటప్పకొండలో త్రికోటేశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే అరవిందబాబు



సంగం జాగర్లమూడి సంగమేశ్వరుడికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి మనోహర్



అమర్తలూరు : గోవాడలో బాల కోటేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



6



క్వారీలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో కాకాని మల్లేశ్వరుడు



గుంటూరు ఏసీ కళాశాలలో పోలింగ్ సామగ్రి సరి చూసుకుంటున్న సిబ్బంది

నేడు పట్టభద్రుల పోలింగ్

- బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి



తెనాలి: ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ

6

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

భక్తిశ్రద్ధల మధ్య మహాశివరాత్రి

భక్తజన సంద్రంగా మారిన కోటప్పకొండ

శివనామస్మరణతో మార్మోగిన అమరావతి, క్వారీ, గోవాడ, కాకాని



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి



కోటప్పకొండలో అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

శివాయ.. రుద్రాయ

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం గురువారం భక్త జన సందోహం మధ్య అత్యంత ఘనంగా జరిగింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్లతో పాటు అమరావతి అమరేశ్వరాలయం, పెదకాకాని భ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి ఆలయం, అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామి ఆలయం, చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాలతో పాటు శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణలతో మార్మోగాయి. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి భక్తులు పోటెత్తారు. శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్లతో కోటప్పకొండ ప్రాంతం జనసంద్రంగా మారింది. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ అంతకంతకు పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థం, పంచామృతాలతో అభిషేకాలు చేసి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన వున్న బొచ్చు కోటయ్యస్వామి వద్ద తలనీలాలను భక్తులు సమర్పించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 2,500 పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు.



నాగేంద్రస్వామి పుట్టవద్ద భక్తుల పూజలు

స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను, వెండి ప్రభను సమర్పించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఏడీసీ చంద్రకాంత్, డీసీ శ్రీనివాసరావు ఈవోలు చంద్రశేఖరరావు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కనువిందు చేసిన ప్రభలు..

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువన కొలువు దీరాయి. కొండపై ఆలయం, కొండ దిగువన ప్రభలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనాయి. విద్యుత్ వెలుగుల్లో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. ప్రభల రాకతో చిలకలూరిపేట రహదారి శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభల రాకతో కోలాహలం నెలకొంది.





నరసరావుపేటలో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి ఆనం

కోటప్పకొండ తిరునాళ్లలో పలు మార్లు ట్రాఫిక్ జామైంది. స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో దాదాపు గంట పాటు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కాన్వాయ్ ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో మంత్రి ఆనం ట్రాఫిక్ నుంచి బయటపడ్డారు. పెట్లూరివారిపాలెం, యలమందల రహదారిలో రాత్రి పది గంటల సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. గంటల తరబడి భక్తులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా ఇక్కట్లు పడ్డారు. పోలీసుల ముందస్తు ప్రణాళికలు విఫలమవడంతో ట్రాఫిక్ కష్టాలు నెలకొన్నాయి.

వీఐపీల తాకిడి.. ఆదాయానికి గండి

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీల తాకిడి భారీగా ఉంది. డీఎస్పీ కార్యాలయం నుంచి 15 వేలకు పైగా వీఐపీ, వీవీఐపీ పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీ క్యూలైన్ కిటకిటలాడింది. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. దీంతో క్యూల్లో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ పాసులు నియంత్రించి ఉంటే టిక్కెట్ కొని స్వామి దర్శనం చేసుకునేవారు. అయితే వారికి పాసులు జారీతో దేవస్థానం ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడింది. వీఐపీల వాహనాలకు కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, కొలికపూడి శ్రీనివాసరావు, రామాంజనేయులు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖరరావు, లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ముదుగుడు హనుమంతరావు, లావు రత్తయ్య, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ స్వామిని దర్శించుకున్నారు.

భక్తులకు చుక్కలు చూపించిన ఆర్టీసీ

కోటప్పకొండ తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులకు ఆర్టీసీ చుక్కలు చూపించింది. అరకొరగా బస్సులు ఏర్పాటు చేసి భక్తులను ఇక్కట్లకు గురి చేసింది. బస్సులు లేక భక్తులు కాలినడకన ఘాట్ రోడ్డున కొండ కిందకు చేరుకున్నారు. వీఐపీల సేవలో తరించిన అధికారులు సామాన్య భక్తులను విస్మరించారు. సాయంత్రం వేళ భక్తులు రద్దీగా ఉన్న సమయంలో చాలా తక్కువ సంఖ్యలో బస్సులు ఏర్పాటుతో ప్రయాణికులు తోపులాటకు గురయ్యారు టికెట్ వసూలు చేసిన ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటును విస్మరించి తమను నడిపిస్తున్నారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

శైవక్షేత్రాలు.. భక్తజన సంద్రం

పెదకాకాని, అమరావతి, అమృతలూరు, పొన్నూరుటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తజన సంద్రంగా మారాయి. అర్ధరాత్రి లింగోద్భవ పూజల అనంతరం స్వామివార్లను భక్తులు దర్శించుకుని తరించారు. పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదేవి సమేత కాకాని మల్లేశ్వరుడు గ్రామోత్సవంలో పెదకాకాని పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో తెల్లవారుజామున అమరేశ్వరుడికి తొలి అభిషేకం ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు, ఈవో సునీల్‌కుమార్ సమక్షంలో జరిగింది.



అమరావతి : అమరేశ్వర స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



పెదకాకాని : మల్లన్న సన్నిధిలో క్యూలో బారులు తీరిన భక్తులు



చేబ్రోలు : క్వారీలో తిరునాళ్ల సందడి



అమృతలూరు : గోవాడలో ప్రత్యేక అలంకరణలో శ్రీబాలకోటేశ్వరస్వామి, అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, జగన్మోహనరావు, కన్నా లక్ష్మీనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం తెల్లవారుజామున అమరేశ్వరస్వామి వార్ల కల్యాణమహోత్సవం జరగనున్నది. కల్యాణమూర్తులకు గురువారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామికి అర్ధరాత్రి ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలకు భక్తులను అనుమతించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచి మూలవిరాట్ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళలు పొంగళ్లు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు స్వామి వారికి వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలలో పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల పోలింగ్

● బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ● గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఆరు జిల్లాల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రిని పీవోలకు అందజేసి రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రూట్ల వారీగా సిబ్బందికి సామగ్రి పంపిణీని బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, జేసీ భార్గవతేజతో కలిసి పరిశీలించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు రాత్రికి అక్కడే బస చేసి ఉదయం 7 గంటలకు ఏజంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సుకు సీలు వేసి సరిగ్గా 8 గంటలకు ఓటింగ్‌ని ప్రారంభిస్తారు. గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లను మాత్రమే ఓటు వేయడానికి అనుమతిస్తారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తాడేపల్లి మండలంలో ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. మొత్తం 3,47,116 మంది ఓటర్లు ఉండగా 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు కలిపి 144 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు, 9 అత్యంత సమస్యాత్మక, 57 సమస్యాత్మక, 273 సాధారణ కేటిగిరీలుగా విభజించారు. 800 మంది ఓటర్ల కంటే తక్కువ ఉన్న పోలింగ్ బూత్‌లకు రెండు, అంతకంటే పెచ్చు ఓటర్లు ఉన్న బూత్‌లకు మూడు బ్యాలెట్ బాక్సులను కేటాయించారు.

ఓటు వేయాలంటే ఏదో ఒక ఐడీ తప్పనిసరి

ఓటరుగా నమోదైన వారు ఎన్నికల సంఘం జారీ చేసిన ఎలక్టోరల్ ఫొటో గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు. ఒకవేళ ఈ కార్డు లేకపోతే ఆధార్/ డ్రైవింగ్ లైసెన్సు/పాన్/ఇండియన్ పాసు పోర్టు/ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ స్థానిక సంస్థలు, ప్రైవేటు ఇండస్ట్రియల్ హౌసెస్ జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు. ఎంపీ/ఎమ్మెల్సీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీలు వారి గుర్తింపు కార్డులు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. విద్యాసంస్థలు జారీ చేసిన సర్వీసు ఐడెండిటీ కార్డులు చూపించినా ఓటు వేయడానికి అనుమతిస్తారు. విశ్వవిద్యాలయం జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దివ్యాంగులు అయితే వారికి కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన సర్టిఫికేట్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన యూడీఐడీకార్డు చూపించాన ఓటు వేయడానికి అనుమతిస్తారు.



నరసరావుపేట : మునిసిపల్ బాలికల స్కూల్‌లో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, డీఆర్వో మురళి

ఓటరు స్లిపు తప్పనిసరి కాదు

ఓటరుగా నమోదైన పట్టభద్రులకు ఓటరు స్లిప్పు అందకపోయినా ఓటు వేయడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఓటు వేయడానికి స్లిప్పు తప్పనిసరి కాదని ఏఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. పోలింగ్ బూత్ నంబరు. సీరియల్ నంబరు ప్రిసైడింగ్ అధికారికి చెప్పి ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపిస్తే ఓటు వేయడానికి అనుమతిస్తారని స్పష్టం చేశారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

పోలింగ్ దృష్ట్యా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు ఆర్వో నాగలక్ష్మి తెలిపారు. కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకునేలా యాజమాన్యాలు క్యాజువల్ లీవులు, ఆలస్యపు అనుమతులు మంజూరు చేయాలన్నారు.



గుంటూరు : ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో కలెక్టర్



రేపల్లె : ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వరి గడ్డి ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వడ్డవల్లికి చెందిన తోట సంతోష్ కుమార్(15), కూరపాటి లిఖిత్(11)ది ఎదురెదురు గృహాలు. శివరాత్రి సందర్భంగా సంతోష్ కుమార్ తన తండ్రికి చెందిన ద్విచక్ర వాహనంపై లిఖిత్‌ను ఎక్కించుకొని అచ్చంపేట రోడ్డులో నిర్మలనగర్‌లో గల నాయనమ్మ గృహానికి బయలు దేరారు. గృహానికి సమీపంలోని సాయికృష్ణ థియేటర్ దాటగానే ఆగి ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను వీరు ప్రయాణిస్తు న్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ సమయంలో మంచు ఉండటంతో వరిగడ్డి ట్రాక్టర్ కన్పించకపోవటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడటంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా లిఖిత్‌ను ఏరియా వైద్యశా లకు తరలించగా మృతి చెందాడు. స్థానికులు సమాచా రాన్ని తల్లిదండ్రులకు, పోలీసులకు తెలపటంతో మృతదే హాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సంతోష్‌కుమార్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువు తుండగా లిఖిత్ మరో ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. లిఖిత్ తండ్రి సుధీర్‌కు ఒక కుమార్తె కూడా ఉంది. సంతోష్‌కుమార్ తండ్రి జానకి రామయ్య పాస్టర్‌గా పని చేస్తుంటాడు. ఇరువురు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివరాత్రి రోజునే ఇద్దరు విద్యార్థులు మృతి చెందటం వడ్డవల్లి ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



తోట సంతోష్‌కుమార్, కూరపాటి లిఖిత్ (ఫైల్)

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	78. 85. 95
చికెన్ విత్ స్కిన్	150.00
చికెన్ స్కిన్ లెస్	160.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, కాకినాడకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు.07031 చర్లపల్లి-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో(శుక్రవారం) రాత్రి 7.20కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 4.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందన్నారు. నంబరు.07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు మార్చి 2, 9, 16, 23, 31 తేదీల్లో(ఆదివారం) సాయంత్రం 6.55కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా సోమవారం ఉదయం 6.50కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07233 చర్లపల్లి - నరసపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో(శుక్రవారం) రాత్రి 8.15కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి గుంటూరు మీదగా శనివారం ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు.07234 నరసపూర్-చర్లపల్లి ప్రత్యేక రైలు మార్చి 2, 9, 16, 23, 31 తేదీల్లో(ఆదివారం) రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా సోమవారం ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

మాతృ విద్యా సంస్థకు వైద్యులు రూ.25 లక్షల విరాళం



సుందరాచారీతో కనుమూరి శ్రీనివాసరావు, నాగభైరవ తిరుమలరావు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు తమ మాతృ విద్యా సంస్థ అభివృద్ధికి చేయూత నిస్తున్నారు. ఇప్పటికే పలువురు పూర్వ విద్యార్థులు జీఎంసీకి భారీగా విరాళాలు అందించగా, తాజాగా మరో ఇద్దరు వైద్యులు తమ వంతు విరాళం ప్రకటించారు. కాలేజీలోని అనాటమీ విభాగంలో రూ.25 లక్షల వ్యయంతో గ్యాలరీ హాల్, రీడింగ్ రూమ్ అభివృద్ధి చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. గుంటూరులోని కనుమూరి హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు, విజయవాడలోని హరిణి హాస్పిటల్ అధినేత, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగభైరవ తిరుమలరావు ఈ విరాళం ప్రకటించారు. వీరు జీఎంసీలో 1983వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు. బుధవారం ఉదయం వీరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీని కలసి ఈ మేరకు తమ సమ్మతిని తెలియజేశారు. మాతృ విద్యా సంస్థ అభివృద్ధికి సహకరించడం తమకు ఆనందంగా ఉందని వారు తెలిపారు. దాతలు డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు, డాక్టర్ నాగభైరవ తిరుమలరావులకు జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ శాలువా కప్పి సత్కరించి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, వెనుక నిందితులు

చోరీ కేసులో నలుగురు నిందితుల అరెస్టు

- రూ. 14 లక్షల 65 వేల ఖరీదైన సొత్తు స్వాధీనం
- నిందితుల జాబితాలో చోరీ సొత్తు కొనుగోలు చేసిన వారు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.14 లక్షల 65 వేల ఖరీదైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరపరిచి వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం మేరకు.... ఈనెల 15న ఆర్టీసీ కాలనీ 5వ లైన్ వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న ఏలేశ్వరం బాల సుదర్శన్‌శర్మ తన కుటుంబంతో విజయవాడలో తన బంధువుల గృహప్రవేశానికి వెళ్లారు. తిరిగి 17న ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి గ్రిల్‌కు వేసిన తాళం పగలగొట్టి ఉంది. బెడ్ రూమ్ లో ఉన్న లాకర్ తెరిచి అందులో ఉన్న 35 వేల నగదు తో పాటు బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పాత గుంటూరు సీఐ సోమయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ పర్యవేక్షణలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పాత గుంటూరు సీఐ వైవీ సోమయ్య, సీసీఎస్ సీఐలు ఎంవీ సుబ్బారావు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి సాంకేతిక ఆధారాలు ఉపయోగించి చోరీకి పాల్పడిన ఇరువురిని గుర్తించారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ఆర్ కాలనీ ఐదో లైన్‌కు చెందిన సయ్యద్ నాగూర్ బాషా, స్వర్ణ భారతినగర్ మూడో లైన్‌కు చెందిన ఉప్పాల సురేష్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా వీరి వద్ద చోరీ సొత్తు కొనుగోలు చేసిన స్వర్ణభారతి నగర్ 5వ లైన్‌కు చెందిన బత్తుల గోపీనాథ్, నల్గొండ జిల్లా రంగారెడ్డిగూడెంకు చెందిన ఊరాది జనార్ధన్‌ను కూడా నిందితులుగా చేర్చారు. నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 లక్షల 65 వేల ఖరీదైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నాగూర్ బాషా పై మొత్తం జిల్లాలో ఏడు కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. లాలాపేటలో రెండు, పాతగుంటూరులో ఐదు కేసులు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా మరో నిందితులు సురేష్ పై పట్టాభిపురంలో మూడు, నల్లపాడులో మూడు, పాత గుంటూరులో ఒకటి, తెనాలి టూ టౌన్ లో ఒకటి ప్రకాశం జిల్లా చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి మొత్తం తొమ్మిది కేసులు ఉన్నట్లు తెలిపారు. చోరీ సొత్తు కొనుగోలు చేసిన గోపీనాథ్ పై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు ఉన్నాయి.

చోరీ సొత్తు కొనుగోలు చేసినా జైలుకే..

దొంగల నుంచి చోరీ చేసిన సొత్తు కొనుగోలు చేసిన వారిని కూడా నిందితులుగా చేర్చి వారిని కోర్టుకు హాజరుపరచడం జరుగుతుందని ఎస్పీ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో సొత్తు కొనుగోలు చేసిన ఇరువురిని కూడా నిందితులుగా చేర్చి అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. చోరీ కేసుల్లో పాత నేరస్థులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఎవరైతే జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత పదే పదే దొంగతనాలు వంటి నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జిల్లా బహిష్కరించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

వాసవీ క్లాత్ మార్కెట్ వద్ద ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకాని రోడ్డులోని వాసవీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎన్‌టీఆర్ కాలనీకిచెందిన చల్లా వెంకటేష్ (16), లాలాపేట పరిధిలోని సయ్యద్ ఖాన్ స్ట్రీట్‌కు చెందిన అబ్దుల్ అలీ (29) మృతి చెందారు. వెంకటేష్ పది రోజులుగా పెట్రోలు బంక్‌లో పని చేస్తున్నట్లు తండ్రి శివరామ్ తెలిపారు. అబ్దుల్ అలీ మెడికల్ రిప్రజెంటేటివ్ గా పని చేస్తుంటాడని పోలీసులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని దుర్గి మండలం అడి గొప్పుల గ్రామానికి చెందిన ఉప్పు సతీష్‌గా గుర్తించారు. సతీష్ సిమ్స్ కాలేజీలో చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, గాయపడిన వ్యక్తిని జీజీహెచ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఊరు పేరు చిరునామా తెలియని సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన వ్యక్తి కొత్తపేటలో సాంబశివపేట 3వ లైన్‌లో గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయన ఒక గది అద్దెకు తీసుకొని ఉంటూ క్యాటరింగ్ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి 9 గంటలకు రూమ్ ఓనర్ చూడగా గదిలో చనిపోయి ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కొత్తపేట పోలీసులు వెళ్లి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వాస్పత్రి శవాగారంలో భద్రపరిచారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు. కొత్తపేట పీఎస్ ల్యాండ్ లైన్ నెంబర్ 08632221815కు గానీ, సీఐకు 8688831320కు గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.



ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రి సిద్ధం చేస్తున్న పోలింగ్ సిబ్బంది



పోలింగ్ సిబ్బందికి విధులు కేటాయిస్తున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల కేంద్రాలకు తరలిన సిబ్బంది
- ఏసీ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పర్యవేక్షించిన కలెక్టర్
- పోలింగ్‌కు ఆటంకం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగ్ కోసం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది తరలివెళ్లారు. గుంటూరు జిల్లాకు సంబంధించి స్థానిక ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రూట్‌ల వారీగా సిబ్బందికి సామగ్రిని అందజేసి బస్సులలో పంపించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి, జేసీ ఏ.భార్గవ తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి దగ్గరుండి డిస్ట్రిబ్యూషన్‌ని పర్యవేక్షించారు. మెటీరియల్ తీసుకున్న పోలింగ్ సిబ్బంది వద్ద ఉన్న బ్యాలెట్ పేపర్, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌వో నాగలక్ష్మి మీడియాతో మాట్లాడారు. పోలింగ్‌కి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేసినట్టు తెలిపారు. ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పరిధిలో శాసనమండలి ఎన్నికలకు 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, గుంటూరు జిల్లాకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఇతర జిల్లాల్లో అక్కడే ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోనే పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన పీఓలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో రిపోర్ట్ చేసి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ మెటీరియల్ తీసుకొని పరిశీలన చేసుకొని పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళుతున్నారని తెలిపారు. శాసన మండలి ఎన్నికలకు పోలింగ్ గురువారం ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు జరుగుతుందన్నారు. ఓటర్లకు ఇప్పటికే 95 శాతం ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఓటర్లు ఓటు స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 గుర్తింపు కార్డులను ఏదో ఒకటి తీసుకొని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గుర్తింపు కార్డు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవడం కుదరదు అన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరన్నారు. కేవలం ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు మాత్రమే సమాచారం అందించడానికి సెల్‌ఫోన్లు వినియోగించడానికి అనుమతి ఉందన్నారు.

ఎన్నికల సందర్భంగా మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి డ్రై డేగా ప్రకటించి మద్యం షాపులను మూసేయించామని, పోలింగ్ ముగిసిన తర్వాత మాత్రమే మద్యం షాపులు తెరవడానికి అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రచారం ముగిసినందున రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలను, బెదిరించటం వంటి చర్యలు చేయరాదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ప్రచారాలు చేయరాదని ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లకు హాని కలిగించే చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలకు పోలింగ్ సిబ్బందితో పాటు ఇతర కార్యక్రమాల కోసం దాదాపు 2500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, మునిసిపల్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వందే శివం.. శంకరం

- శివనామ స్మరణతో శైవక్షేత్రాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పట్టాభిపురం శైవక్షేత్రంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహా ప్రాణం దీపం.... శివం శివం.. మహా దివ్యతేజం... శివం శివం అంటూ నీలకంఠుడి సేవలో భక్తులు తరించారు. హరహర మహాదేవ శంభో శంకర.... వందే శంకరంతో...నామ స్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని నగరంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులు కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని అరండల్‌పేట, పట్టాభిపురం, కొత్తపేట శివాలయాలు, శ్యామలానగర్ సంతోషిమాత ఆలయం, మల్లారెడ్డినగర్, ఇతర ప్రాంతాలోని అలయాల్లో స్వామి వారికి అభిషేకార్చనలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శివ, పార్వతుల కల్యాణాలు జరిగాయి. ఆయా ఆలయాల్లో వేకువజాము వరకు జరిగే ఉపవాస దీక్షలలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో శివరాత్రిని పురస్కరించుకుని లక్ష్మీ గణపతి, రుద్ర, చండీ హోమాలు మహాపూర్ణాహుతి నిర్వహించారు.



అరండల్‌పేట, శివాలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



స్థానిక మారుతినగర్‌లో స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో...



పులి శ్రీనివాసులకు శ్రీ చక్రం అందజేస్తున్న రాజయోగిని, పక్కన రమణ యశస్వీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవాపురంలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో మహా శివరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ పాల్గొని శివ పరమాత్మ పలూకను ఆవిష్కరించారు. అనంతరం సప్తవర్ణశోభిత శివలింగ దర్శనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులకు బ్రహ్మకుమారి రాజయోగిని బీకే జయలక్ష్మి శ్రీ చక్రాలను, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రాజయోగినిలు సుహాసిని, అరుణ, శాంత తదితరులు పాల్గొని రాజయోగ అభ్యాసం చేయించారు.



కొత్తపేట శివాలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకానిరోడ్డులోని సీతానగరం రెండో లైన్లో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాలు మహాశివరాత్రి పురస్కరించుకొని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తూర్పు ఎమ్మెల్యే నసీర్ పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి కచేరీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగోపు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసరావు, నీలా శివశంకర్, డాక్టర్ ముంజంపల్లి శివకుమార్, జొన్నకూటి లవకుశ లవకుమార్, రాగం సదాశివరావు, కందుకూరి గురు బ్రహ్మాచారి, హర్సెస్, గొడుగు శంకరరావు, బత్తిని శంకర్, అరవపల్లి శ్రీనివాసరావు, ఎద్దుల రమేష్, తాలేటి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో ఆత్మశుద్ధి, లక్ష్యసిద్ధి కలగాలి

- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడి కరుణాకటాక్షాలతో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆత్మ శుద్ధి, లక్ష్యసిద్ధి కలగాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కోరుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని పలు శివాలయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన భక్తులు ఎంతో పవిత్రంగా ఉపవాసాలు ఉండి పరమేశ్వరునికి పూజలు నిర్వహిస్తారని, ఇది ఎంతో పుణ్యఫలమని అన్నారు. మహాశివరాత్రికి శివుడిని పూజించడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల్లో ఉండే పూజారులకు గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచారని, దీంతో 3,203 మంది అర్చకులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందడుగు వేసిందని తెలిపారు.



శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

కోటప్పకొండ భక్తులకు వాటర్ బాటిల్స్ అందించిన మన్నవ

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకి విచ్చేసిన భక్తులకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ వాటర్ బాటిల్స్ అందజేశారు. కోటప్పకొండ ఆ పరమశివుని దర్శించుకోవటానికి వస్తున్న భక్తులకి తనవంతుగా వాటర్ బాటిల్స్ అందించడం చాలా సంతోషంగా ఉందని మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, తెలుగు రాష్ట్ర ప్రజలు సుఖ, సౌఖ్యాలతో ఉండాలని శివుని కోరుకున్నారు.



భక్తులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

శివునికి నృత్య నివేదన



శివునికి నృత్య నివేదన చేస్తున్న చిన్నారులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ వారు అన్నమయ్య కళా వేదికపై మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు శివపాద మంజీర నాదం -2 శివరాత్రి నృత్య జాగరణ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో 108 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనతో శివునికి నృత్య నివేదన చేశారు. నాట్య చార్య డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం నృత్య దర్శకత్వంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, బొల్లెపల్లి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య ప్రారంభించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, లక్ష్మీ నరసింహ దేవాలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని స్వర రాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, పిఎల్ నరసింహారావు, మల్లేశ్వరరావు, మూర్తి పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై సాయి అభిరామ్, తబాలపై ప్రభల రమణ వాయిద్య సహకారం అందించారు. కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ధ్యాన పరమేశ్వరుడికి మేయర్ పూజలు

- భారీగా అన్న ప్రసాద వితరణ

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పురస్కరించుకొని ఆర్ అగ్రహారం రామనామక్షేత్రం రోడ్డులో కొలువైన ధ్యాన పరమేశ్వరుడికి నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ధ్యాన పరమేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. రామనామక్షేత్రం మెయిన్ రోడ్డులో కొలువైన ధ్యాన పరమేశ్వరుడి విగ్రహానికి రంగు రంగుల విద్యుద్దీపాలతో నూతన శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ధ్యాన పరమేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేసిన తరువాత తొలిసారిగా మహా శివరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, భారీగా అన్న ప్రసాద వితరణకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ

» ప్రతిపాదనలు పంపాలని డీఎంఈకి మంత్రి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ సిద్ధమైంది. తద్వారా వారు విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు పొందేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో విదేశీ భాషలపై శిక్షణకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు పంపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. తొలుత 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఇలాంటి కోర్సులను ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నర్సింగ్ విద్యార్థుల భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థతో కలిసి ఈ శిక్షణ ఇవ్వాలని ఆరోగ్యశాఖ ఆలోచిస్తోంది. ఈ విషయంపై మంత్రి సత్యకుమార్ సంబంధిత సీనియర్ అధికారులతో ఇటీవల చర్చించారు. సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని డీఎంఈని ఆదేశించారు. కాగా, దీనిపై డీఎంఈ ఇప్పటికే 7 వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థుల అభిప్రాయాలు, భాషా ప్రాధాన్యతల గురించి అభిప్రాయాలు తీసుకుంది. ఎక్కువ మంది నర్సింగ్ విద్యార్థులు జర్మన్, జపనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్ వంటి భాషలను నేర్చుకునేందుకు ఉత్సాహంగా ఉన్నట్టు తెలిసింది.

పీసీసీఎఫ్ ఎంపికకు కమిటీ నియామకం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ నుంచి రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) పోస్టుకు తగిన అధికారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పీసీసీఎఫ్‌గా ఉన్న చిరంజీవ్‌చౌదరి ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అపెక్స్ స్కేల్‌తో కూడిన ఐఎఫ్ఎస్ అధికారిని పీసీసీఎఫ్‌గా ఎంపిక చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీని నియమించారు.

శివరాత్రి స్నానాలకు వెళ్లి 9మంది మృతి

» గోదావరిలో మునిగి ఐదుగురు విద్యార్థులు..

» శ్రీశైలంలో కొడుకును రక్షించబోయి తండ్రీ..

» బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు..

రాజమహేంద్రవరం, పెనుగంచిప్రోలు, నున్నిపెంట, పెదవేగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నదుల్లో స్నానానికి వెళ్లిన తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. శ్రీశైలంలో నీటిలో మునిగిపోతున్న కొడుకును రక్షించబోయి తండ్రి, బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు, గోదావరి నదిలో మునిగిపోతున్న స్నేహితుల రక్షణ కోసం వెళ్లిన విద్యార్థులు చనిపోయారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్(17), తిరుమలశెట్టి పవన్(19), పడాల దేవదత్త సాయి(18), పడాల రామ దుర్గాప్రసాద్(19), అనిశెట్టి పవన్ గణేశ్(17) తోపాటు మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి బుధవారం గోదావరి ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక మేటలు ఉన్నాయని మరింత ముందుకు వెళ్లారు. నదిలో సుమారు పది అడుగుల దూరం వెళ్లిన తర్వాత నీళ్లు బాగా నీలం రంగులో ఉన్నాయని, ముగ్గురు మరింత ముందుకు వెళ్లారు. అంతే.. అకస్మాత్తుగా నీటిలోకి జారిపోయారు. వాళ్లను రక్షిద్దామని వెళ్లిన మరో ఇద్దరు కూడా పైకి రాలేకపోయారు. దీంతో ఐదుగురూ ప్రాణాలు విడిచారు. మిగతా స్నేహితుల అరుపులతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలియగానే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. నదిలో గాలించి ఐదుగురి మృతదేహాలను బయటకు తీశారు. విద్యార్థులంతా ఒకే ఊరు, ఒకే వీధికి చెందిన వాళ్లు కావడంతో గ్రామం శోకంలో మునిగిపోయింది.

శ్రీశైలంలో తండ్రీకొడుకులు..



తండ్రీకొడుకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన పెరుగు గురవయ్య (35), అతడి కుమారుడు వాసు (11) శ్రీశైలం వద్ద కృష్ణా నదిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రాంతానికి చెందిన 40 మంది భక్తులు శ్రీశైలం వెళ్లారు. బుధవారం స్నానాలు చేసేందుకు నదిలోకి దిగారు. ముందుగా కుమారుడు వాసు నీటిలోకి దిగి.. కాలు జారి కొట్టుకుపోతుండగా అతడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి కూడా అదృశ్యమయ్యారు. మత్స్యకారులు మృతదేహాలను బయటకు తీశారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడపడితే అక్కడ డ్రెడ్జింగ్ చేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే యువకులు మృత్యువాతపడ్డారు. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేవు.

తమ్మిలేరులో అన్నదమ్ములు..

ఏలూరు జిల్లా ముసునూరు మండలం బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన అన్నదమ్ములు తమ్మిలేరులో స్నానానికి దిగి చనిపోయారు. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన పేరిచర్ల మారేష్, మంగమ్మ దంపతులు, వారి కుమారులు మునియ్య, మణికుమార్ బంధువులతో కలిసి బలివే వచ్చారు. తమ్మిలేరులో స్నానాలు చేసి, స్వామివారి దర్శనానికి బయలు దేరారు. కుమారులిద్దరూ కొద్దిసేపు స్నానం చేసి వస్తాం... మీరు వెళ్లండని తల్లిదండ్రులకు చెప్పారు. దర్శనం పూర్తయినా.. కుమారులిద్దరూ రాకపోవడంతో వెతుక్కుంటూ తమ్మిలేరు దగ్గరకు వచ్చారు. మునిపల్లె సమీపంలో మణికుమార్(18) మృతదేహం కనిపించింది. మరో కుమారుడి కోసం వెతుకుతుండగా నీటిలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు మునియ్య(20) మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది.

రీ సర్వే డ్యూటీలో ఉన్నా హాజరు తప్పనిసరి

» రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్లకు హాజరు తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీ సర్వే, స్వమిత్వ, ఇతర విధుల కోసం గ్రామాలు, మండలాలు మారి వేరోచోట విధులు నిర్వర్తించే వారికి కూడా హాజరు తప్పనిసరి చేస్తూ భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు వారి హాజరుపై నిర్దిష్టమైన ఆదేశాలివ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల విభాగానికి ఆమె లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రీ సర్వే విధుల్లో భాగంగా సొంత మండలం లేదా ఇతర మండలాల్లో పనిచేసే వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో హాజరు నమోదు చేసుకోవాల్సిందేనని గ్రామ, వార్డు సచివాలయాల విభాగం కార్యదర్శి కాటమేని భాస్కర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. రీ సర్వే పనుల్లో ఉన్నామని, తమకు హాజరు మినహాయించాలని పలువురు సర్వేయర్లు కొంతకాలంగా కోరుతున్నారు. అయితే ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు రీసర్వే పనులు మానేసి ఇతర కార్యకలాపాల్లో బిజీగా ఉండిపోతున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, రీ సర్వే పనుల కోసం ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా హాజరు వేయాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సరికొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నాం

- ఆది పినిశెట్టి



'కథాబలంతో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్న హారర్ చిత్రం 'శబ్దం'. ఇప్పటివరకూ వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని హీరో ఆది పినిశెట్టి అన్నారు. 'వైశాలి' చిత్రం తర్వాత దర్శకుడు అరివళగన్, ఆది పినిశెట్టి కలయికలో వస్తున్న చిత్రమిది. సెవెన్ జీ ఫిల్మ్స్ శివ నిర్మించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్, ఎన్ సినిమాస్ ద్వారా ఈ నెల 28న 'శబ్దం' చిత్రం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఆది పినిశెట్టి మీడియాతో పంచుకున్నారు. "ఇప్పటివరకూ ప్రేక్షకులకు తెలియని ఓ సరికొత్త ప్రపంచాన్ని 'శబ్దం' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నాం. ఇందులో అతీత శక్తుల గురించి అన్వేషించే పరిశోధకుడి పాత్రలో కనిపిస్తాను. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. ఆత్మలకూ శబ్దానికి ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. 'వైశాలి' లానే 'శబ్దం' కూడా నిజాయితీగా చేసిన ప్రయత్నం. తప్పక ఫలిస్తుందనే నమ్మకం ఉంది. సిమ్రాన్, లైలా పాత్రలు సినిమాలో కీలకం. తమన్ నేపథ్య సంగీతం అద్భుతంగా కుదిరింది. ప్రస్తుతం 'అఖండ 2, మరకతమణి 2, మయసభ, డ్రైవ్' చిత్రాలు చేస్తున్నాను" అని ఆయన చెప్పారు.

మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు



'శివన్న' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే కన్నడ టాప్ స్టార్ శివ రాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్నారు. మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు హాజరవుతానని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తనకు క్యాన్సర్ ఉన్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో తెలిసిందనీ, కుటుంబ సభ్యులు, వైద్యులు ఇచ్చిన ధైర్యంతో చికిత్స చేయించుకున్నాననీ శివ రాజ్‌కుమార్ ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'కీమో థెరపీ చేయించుకుని షూటింగ్‌కు వెళ్లిన రోజులు ఉన్నాయి. మొత్తానికి క్యాన్సర్ నుంచి బయట పడ్డా. చికిత్స అనంతరం ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేస్తున్నా. ఆహార నియమాలు పాటిస్తున్నా. మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొంటున్నా. మార్చి 5న హైదరాబాద్ వెళ్లి రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటా. ఆ సినిమాలో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది' అని చెప్పారు శివ రాజ్‌కుమార్.



ప్రభాస్, ప్రశాంత్ వర్మ చిత్రం.. ఎప్పటినుంచి?



హీరో ప్రభాస్ స్పీడ్ పెంచారు. చేతిలో ఉన్న సినిమాలు చకచకా పూర్తి చేస్తూ కొత్త వాటి మీద కూడా దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలు చేస్తున్నారు. ఇవి కాకుండా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందే 'స్పిరిట్' సినిమా చేయాలి. ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా వీలైనంత త్వరలో ప్రారంభిచాలని ప్రభాస్ ఆలోచన. ఇప్పుడు ఆయన మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారనీ, ఈ సినిమాకు సంబంధించి ప్రభాస్ లుక్ టెస్ట్ కూడా జరిగిందని సమాచారం. ఇవి కాకుండా 'కల్కి పార్ట్ 2', 'సలార్ 2' చిత్రాలను ప్రభాస్ చేయాలి. ఇన్ని సినిమాలు ప్రభాస్ ఎప్పుడు, ఎలా చేస్తారు, వీటిల్లో ఏది ముందు మొదలవుతుందనేదే ఆ చర్చ.

సందేశం, వినోదం అలరిస్తాయి



బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఆయన కథానాయకుడిగా మాధవ్ కోదాడ దర్శకత్వంలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన చిత్రం "నేనెక్కడున్నా'. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిమో చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ.. 'చిన్నప్పటి నుంచి దక్షిణాది చిత్రాలు చూస్తూ పెరిగాను. నాకు తెలుగు సినిమాలో అవకాశం వచ్చిందని తెలియగానే నాన్న సంతోషించారు. 'ప్రయత్నలోపం లేకుండా కష్టపడు, నిజాయితీగా పనిచెయ్యి' అని చెప్పారు. సందేశం, వినోదం కలబోతగా దర్శకుడు 'నేనెక్కడున్నా' చిత్రాన్ని తీర్చిదిద్దారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, పతాక సన్నివేశాల్లో వచ్చే మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. ఈ చిత్రంతో హీరోగా తెలుగులో నిలదొక్కుకుంటాననే నమ్మకం ఉంది' అని చెప్పారు.

తెలుగులోకి 'ఛావా'



విక్కీ కౌశల్, రష్మిక జంటగా రూపుదిద్దుకున్న చారిత్రక చిత్రం 'ఛావా'. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. పదకొండు రోజుల్లో ఈ సినిమా రూ. 417 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో బాలీవుడ్ సంబరాలు చేసుకుంటోంది. దక్షిణాది సినిమా వచ్చి తమని చావు దెబ్బ తీసిందని వాపోతున్న సినీ వర్గాలు 'ఛావా' విజయంతో ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఉత్తరాదిన విజయయాత్ర కొనసాగిస్తున్న ఈ సినిమా త్వరలో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న తెలుగు ప్రేక్షకుల కోసం తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మార్చి 7న విడుదల చేస్తోంది.

పెళ్లి నేపథ్యంలో పీరియాడిక్ చిత్రం



పెళ్లి నేపథ్యంలో హాస్యం, వ్యంగం కలబోతగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించింది. 1980లో వరంగల్ జిల్లాలో జరిగిన సంఘటన ఆధారంగా అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత తెలిపారు.

రాక్షసుడు వస్తున్నాడు



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వంలో ఎంవీఆర్ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ఫిబ్రవరి 28కి బదులు మార్చి 7న 'రాక్షస' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి. జాకబ్

షార్ట్ షాట్స్

గుండెలోన గట్టి సప్పుడు



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, సవాళ్ల నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నారి'. ఆమని ప్రధాన పాత్ర పోషించారు. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రం విడుదలవుతోంది. మహా శివరాత్రి సందర్భంగా 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. రమణ గోగుల ఆలపించగా, వినోద్ కుమార్ విన్ను స్వరపరిచారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వి. రవికుమార్.

ఒగ్గు కళ నేపథ్యంలో




ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, జయరామ్, ఛత్రపతి శేఖర్ కీలకపాత్రలు పోషించారు. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 'ఒగ్గు కళాకారుల జీవితాల్లోని ఒడిదొడుకులను వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం 'బ్రహ్మాండ' చిత్రం ద్వారా చేస్తున్నాం' అన్నారు. తెలంగాణ సంస్కృతి, పల్లె ప్రజల అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తీక్

శివుని పాటతో చంద్రేశ్వర



సురేష్ రవి, ఆశ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'చంద్రేశ్వర'. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరిస్తూ దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ సినిమాను జీవా పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఆర్కియాలజీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. డివోషనల్ టచ్‌తో పాటు మంచి కామెడీ కూడా సినిమాలో ఉంది. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

కొత్తదనంతో క్రైమ్ కథ



ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో రూపొందుతున్న చిత్రం 'బ్లడ్ రోజెస్'. ఎంజీఆర్ దర్శకత్వంలో హరీశ్ కే నిర్మించారు. సీనియర్ నటుడు సుమన్, రంజిత్‌రామ్, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా చిత్రబృందం బుధవారం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. భయపెట్టే కథనం, ఊపిరిసలపని ట్విస్ట్‌లతో మా క్రైమ్ కథా చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, సినిమాటోగ్రఫీ: శివకుమార్ ఓగిరెడ్డి.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

మల్లేశ్వరస్వామికి వెండి నామాల బహూకరణ



వెండి నామాలను ఈవోకు అందజేస్తున్న దాత వాసు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివలింగానికి అలంకరించే నిమిత్తం దాతలు త్రినేత్రంతో కూడిన వెండినామాలను బహూకరించారు. మంగళగిరికి చెందిన దాత విడేల సాయి శ్రీనివాస్, హారిక దంపతులు ఈ నామాలను తయారు చేయించి బుధవారం శివాలయం ఈవో నారాయణకు అందజేశారు. వెండి నామాలను స్వామివారికి అలంకరించి అభిషేకాలు నిర్వహించారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటుచేసినట్టు మంగళగిరి నియోజకవర్గ సహాయ ఓటర్ల నమోదు అధికారి దినేష్ రాఘవేంద్ర తెలిపారు. పట్టణ పరిధిలోని పోలింగ్‌కేంద్రాలకు సంబంధించి టీ మధుసూదన్, సెల్: 90143 79948, రూరల్ పరిధిలోని కేంద్రాలకు సంబంధించి టీ వేణు, సెల్: 78160 55934 నంబర్లలో సంప్రదించి పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు.



పెయింటింగ్‌లో రాణిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన మంగళగిరికి చెందిన పఠాన్ జైనబ్ ఖాన్ బుధవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. జైనబ్ 7 గంటలు శ్రమించి 318 విస్తరాకులతో సర్దార్ భగత్‌సింగ్ చిత్రాన్ని రూపొందించడం పట్ల మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు.

-మంగళగిరి

పశ్చిమడెల్టాకాల్వకు 416 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 416 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 66 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 60, పశ్చిమకాల్వకు 120, నిజాంపట్నంకాల్వకు 60, కొమ్మమూరుకాల్వకు 170 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



పోలిమెట్ల రత్నగిరి అందించిన కైలాసయాత్ర వాహనం

కైలాసయాత్ర వాహనం అందజేత

దుగ్గిరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలువూరు గ్రామానికి కైలాసయాత్ర వాహనాన్ని బుధవారం అందించారు. గ్రామానికి చెందిన పోలిమెట్ల రత్నగిరి తన తల్లిదండ్రులు పోలిమెట్ల వెంకటేశ్వరరావు, లక్ష్మీనరసమ్మ, కుమారుడు రవిప్రసాద్‌ల జ్ఞాపకార్థం గ్రామానికి కైలాసయాత్ర వాహనాన్ని అందించారు. గద్దె శ్రీనివాస్, మండవ మౌళయ్య, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య.. భర్త ఆత్మహత్య



సురేష్, భార్య శ్రావణి (ఫైల్ ఫొటో)

దుగ్గిరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్యను హత్యచేసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల గ్రామం రేవేంద్రపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొక్కినాల సురేష్(38) ఉరిపెట్టుకుని మృతి చెందగా, భార్య శ్రావణి(32) మృతదేహం పక్కనే పడివుంది. సురేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు స్థానికులు బుధవారం సాయంత్రం సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శ్రావణి కుటుంబసభ్యులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి, సురేష్ గొంతుకు ఉరిపెట్టుకుని కనిపించగా, శ్రావణి తీవ్రగాయాలతో పక్కనే దుప్పటి కప్పి విగతజీవిగా పడి ఉంది. వల్లభాపురం గ్రామానికి చెందిన సురేష్, పదేళ్ల క్రితం రేవేంద్రపాడుకు చెందిన శ్రావణిని వివాహం చేసుకున్నాడు. హైద్రాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ, రెండేళ్లక్రితం రేవేంద్రపాడు వచ్చి భార్య, కుమారుడితో కలిసి అత్తింటికి దగ్గర్లో ఉంటున్నారు. కాగా సురేష్, భార్య శ్రావణి గొడవలు పడుతుండటంతో వారి ఇంటికి దూరంగా ఓ అద్దె ఇంటికివెళ్లి కాపురం ఉంటున్నారు. నాలుగురోజులు క్రితం ఇద్దరు మరోమారు గొడవపడటంతో శ్రావణి తన పుట్టింటికి వెళ్లింది. తాను భర్తతో సఖ్యతగా ఉంటానని చెప్పి తిరిగి మంగళవారం సురేష్ వద్దకు వెళ్లింది. కుమార్తె సాయంత్రానికి మృత్యువాతపడటంతో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. వీరి మృతికి వివాహేతర సంబంధం కారణం కావచ్చని భావిస్తున్నారు. సురేష్, శ్రావణిలకు పదేళ్ల కుమారుడున్నాడు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

● వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీతానగరం కృష్ణాతీరంలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుండే వేలసంఖ్యలో భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం నదీతీరంలో ఉన్న శ్రీసంగమేశ్వర, రాజరాజేశ్వర, సోమేశ్వర స్వామివార్ల దేవాలయాల్లో జరిగిన ఈశ్వరునికి ప్రత్యేకపూజలు, విశేష అభిషేకాలలోభక్తులు పాల్గొన్నారు. ప్రకాశం బ్యారేజి నుండి సీతానగరం పుష్కరఘాట్ల వరకు భక్తుల రద్దీ నెలకొంది. తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ జేఎస్ రావు సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భక్తులకోసం మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. పలువురు టీడీపీ నేతలు, స్థానిక మత్స్యకారులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న సీతానగరం కృష్ణాతీరం

శివాలయాల్లో విశేష పూజలు..

సీతానగరం శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతి సమేత సోమేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి జె.సాయివిశ్వనాథ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అంబటి వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, రఘురాములు ఉభయదాతలుగా కల్యాణంలో పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జలశంకరునికి ప్రత్యేక పూజలు

కనకదుర్గమ్మ వారధి కృష్ణానదిలోని శ్రీభవానీ జలశంకర దేవాలయంలో జలశంకరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ గుత్తికొండ శివన్నారాయణ పర్యవేక్షించారు.



అలంకరణలో మంగళగిరి దుర్గానగర్‌లో మల్లేశ్వరస్వామి

చైతన్య తపోవన్‌లో ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు

తాడేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి శివకేశవ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవం నులకపేటలోని చైతన్య తపోవన్‌లో మాతా శివానందసరస్వతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివధ్యానం చేయించి శివాసుందరేశ్వరస్వామికి ఏకాదశ, పంచామృత రుద్రాభిషేకాలు, 108 స్ఫటికలింగాలకు భస్మాభిషేకం శివనామ సంకీర్తనలతో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శివకేశవ కల్యాణం, లింగోద్భవ దర్శనం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ట్రస్టీలు సుధ, విజయ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీసోమేశ్వర స్వామి

మార్మోగిన శివ నామస్మరణ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో మహాశివరాత్రి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శివాలయాలు భక్తుల తో కిటకిటలాడాయి. బుధవారం వేకువజామునుంచే ఆలయాల్లో మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి మెట్లమార్గంలో వున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భగీరథ సేవాట్రస్టు చైర్మన్ పందేటి సాంబశివరావు, సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీచేశారు. భక్తబృందాల ఆధ్వర్యంలో అన్న సంతర్పణ గావించారు. పాతమంగళగిరి దుర్గానగర్ బైపాస్‌లో వున్న శ్రీకనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం కల్యాణం నిర్వహించారు.

వైభవంగా శ్రీరాజరాజేశ్వరస్వామి కల్యాణం

దుగ్గిరాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల గ్రామం పెదకొండూరు శ్రీగంగాదుర్గాపార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 1గంటకు లింగోద్భవ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీపార్వతీసమేత శ్రీఆనందీశ్వరాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం జరిపారు.



వంద పడకల ఆసుపత్రి భవన నమూనాపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

అత్యాధునిక వసతులతో వంద పడకల ఆస్పత్రి

● మంగళగిరి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

● ఆస్పత్రి భవన నమూనాపై మంత్రి లోకేశ్ సమీక్ష

మంగళగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని వద్ద ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం ఆస్పత్రి భవన నమూనాపై అధికారులతో ఆయన సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవననమూనాను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక వసతులతో వంద పడకల ఆస్పత్రిని తీర్చిదిద్దాలన్నారు. ఈ ఆస్పత్రి దేశానికే రోల్ మోడల్‌గా నిలవాలని చెప్పారు. వైద్యులు, రోగులు, విజిటర్స్ కోణంలో జోన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులు వుండేలా ఆస్పత్రి నిర్మాణం వుండాలన్నారు. పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో వుంచుకుని నమూనాను రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ సీఈ జీ.సుధాకర్‌రెడ్డి, డీఈఈ ఎం.హనుమంతరావు నాయక్, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, ఏఈ జీ గోపీచంద్, ఏఈ కే శివసత్యనారాయణ, భార్గవ్ గ్రూపు చీఫ్ ఆర్కిటెక్చర్ నిఖిల, డీజీఎం ఎ.శ్యామ్‌కిషోర్, సీనియర్ ఇంజనీర్ డి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ

తుళ్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెక్కల్లులో పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. అమ్మవారి విగ్రహానికి ఉన్న వెండి వడ్డాణం, కిరీటం, హుండీలో కానుకలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని భక్తులు చెపుతున్నారు. గుడిలో ఉన్న సీసీ కెమెరాలను పగలగొట్టి వాటి బాక్సులను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున సంఘటన జరిగినట్టు భావిస్తున్నారు. ఉదయాన్నే గుడికి వచ్చిన పూజారి, భక్తులు హుండీ తాళం పగలగొట్టి ఉండటం గమనించారు. పూజారి ఫిర్యాదు మేరకు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై కలగయ్య పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెజవాడ దుర్గమ్మకు మంగళగిరి చేనేత వస్త్రాలు



దుర్గగుడిలో చేనేత పట్టువస్త్రాలను సమర్పిస్తున్న భక్త మార్కండేయ ట్రస్టు ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళగిరికి చెందిన భక్తమార్కండేయ ట్రస్టు ఆధ్వర్యంలో శివభక్త మార్కండేయ వంశీకులు బెజవాడ శ్రీకనకదుర్గ అమ్మవారికి చేనేత పట్టువస్త్రాలను బహూకరించారు. మంగళగిరిలోని చేనేతమగ్గాలపై ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారుచేయించారు. ప్రతియేటా శివరాత్రి సందర్భంగా జరిగే శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల కల్యాణానికి ఈ వంశీకులు చేనేత పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈ ఏడాది ప్రధాన కైంకర్యపరులుగా ట్రస్టు వ్యవస్థాపకసభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరి దంపతులు, గుత్తికొండ ధనుంజయరావు, విజయ దంపతులు వ్యవహరించారు. ట్రస్టు చైర్మన్ దామర్ల వెంకట నరసింహం ఆధ్వర్యంలో సభ్యులు చేనేతవస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, విభూది, ఫలపుష్పాలతో ఆలయానికి చేరుకున్నారు. దేవస్థానం ఉపకార్యనిర్వహణాధికారి రత్నరాజు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు చిల్లపల్లి మోహనరావు, గంజి చిరంజీవి, అందె నాగప్రసాద్, దామర్ల రాజు, సభ్యులు శ్యామ్, పూర్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాక్షరి మంత్రంతో మార్మోగిన శివాలయాలు

తాడికొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వివిధ శైవాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి భక్తు లు శివాలయాలను సందర్శించారు. భక్తిశ్రద్ధలతో శివలింగాలకు అభిషేకాలు జరిపించారు. అమ్మవార్లకు అర్చనలు చేయించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పగలంతా ఉపవాస దీక్షతో ఉన్న భక్తులు రాత్రి శివాలయాల్లో జాగారం చేశారు. తాడికొండ కొండపై ఉన్న కొండ మల్లికార్జునస్వామిని భక్తులు ఉత్సాహంగా కొండెక్కి దర్శించుకున్నారు. పగలంతా భక్తులు అభిషేకాలు చేశారు. రాత్రి లింగోద్భవ పూజలు నిర్వహించారు. అనంతరం గంగాభ్రమరాంబ సమేత కొండ మల్లికార్జునస్వామి శాంతికల్యాణాన్ని నిర్వహించారు. స్థానిక గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి, గిరీశ్వర స్వామి ఆలయంలో స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రు ద్రాభిషేకం, శాంతికల్యాణం నిర్వహించారు. భక్తుల కు ప్రసాదాలను పంపిణీచేశారు. మండల గ్రామా ల్లోని శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

తుళ్లూరు మండలంలో...

తుళ్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పంచాక్షరి మంత్రంతో శివాలయాలు, బుధవారం మార్మోగాయి. తెల్లవారుజామునుంచే స్వామివారికి ప్రత్యేకపూజలు అభిషేకాలు భక్తులు నిర్వహించారు. తుళ్లూరులో గంగాపార్వతి సమేత రామలింగేశ్వర ఆలయం, దుర్గా మల్లికార్జునస్వామి ఆలయం, దొండపాడు రాజమల్లేశ్వరస్వామి ఆలయం, బోరుపాలెం, రాయపూడి, మందడం, వెంకటపాలెం, నేలపాడు, ఐనవోలు, పెదపరిమి, హరిశ్చంద్రపురం, వెలగపూడి, మల్కాపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేశారు. తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో కోటిలింగాలస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. కృష్ణానదిలో స్నానాలు ఆచరించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నా రు. తుళ్లూరు రామలింగేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజలు ఆలయాల్లో నిర్వహించారు.

వట్టిచెరుకూరు మండలంలో...

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మ హాశివ రాత్రికి మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఆయా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. సౌపాడు, ముట్లూరు, లేమల్లెపాడు గ్రామాల మధ్య పురాతన శివలింగం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయా ల్లో స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. సౌపాడులోని వీరబ్రహ్మేంద్ర స్వామి, లలితాపరమేశ్వరి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లకు గ్రామోత్సం, కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. పల్నాడు జిల్లా కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా ముట్లూరు గ్రామస్తులు అక్కడి కాకతీయ సేవాసమితికి అన్నదానం నిమిత్తం 24క్వింటాళ్ళ బియ్యం, రూ.1,30,500 నగదును కమిటీ కార్యదర్శికి అందజేశారు.

పెదనందిపాడు మండలంలో...

పెదనందిపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజామునుంచే భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివార్లకు అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానంలో కమిటీ ఆధ్వర్యంలో విశేష హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దాతలు, గ్రామస్థుల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు ముద్దన నగరాజకుమారి, దాసరి శేషగిరిరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. శివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు తరలివెళ్లే భక్తులకు సోమేశ్వరస్వామి దేవస్థానం, పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద రైతన్న డెయిరీ, డీఎఫ్‌టీ యూత్ ఆధ్వర్యంలో అందించిన మజ్జిగ ప్యాకెట్‌లను మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతన్న డెయిరీ చైర్మన్ కమ్మ నాగమల్లేశ్వరరావు, కొత్త శ్రీధర్, నూతి వెంకటేశ్వర్లు, దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



తాడికొండ కొండపై విద్యుత్ ప్రభ

కాకుమాను మండలంలో...

కాకుమాను, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మూరులో ప్రసిద్ధిగాంచిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారిని దర్శించుకునేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాకుమానులోని శ్రీగంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం, రేటూరులో అమరామృత లింగేశ్వరి సమేత అమరలింగేశ్వరస్వామి ఆలయంలో స్ఫటికలింగాన్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే రామలింగేశ్వరస్వామి ఆలయం, బోడిపాలెంలోని శివాలయం, వల్లూరు తదితర గ్రామాలో శైవాలయాలలో శివరాత్రి పూజలు జరిగాయి. రాత్రి జాగారంలో భాగంగా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.



ప్రత్యేక అలంకరణలో మూలస్థానేశ్వరస్వామి

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

● ఉండవల్లిలో ఓటు హక్కు వినియోగించుకోనున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన జరగనున్న కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. తాడేపల్లి అర్బన్ పరిధిలో ముగ్గురోడ్డు పాఠశాల, క్రిస్టియన్‌పేట పాఠశాల, రూరల్ పరిధిలో ఉండవల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటుచేశారు. తాడేపల్లి అర్బన్‌లోని 4 పోలింగ్ కేంద్రాల్లో 3218మంది, రూరల్ పరిధిలోని 4 పోలింగ్ కేంద్రాల్లో 2308మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉండవల్లిలో నివాసం ఉంటున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ స్థానికంగా ఉన్న గాదె రామయ్య, సీతారావమ్మ మండల ప్రాథమికోన్నత పాఠశాలలోని 284ఎ పోలింగ్ కేంద్రంలో ఉదయం 9గంటలకు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లుచేసినట్లు తహసీల్దార్ ఐ.సునీత తెలిపారు. పోలింగ్ సిబ్బంది ప్రత్యేక బస్సులో బ్యాలెట్ బాక్సులతో బుధవారం దుగ్గిరాలలోని జిల్లాపరిషత్ బాలురోన్నత పాఠశాలకు చేరుకున్నారు. ఓటర్లు, సిబ్బందికి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను తహసీల్దార్ సునీత పరిశీలించారు. మండలంలోని 18 గ్రామాలకు చెందిన 2254మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్‌స్టేషన్‌ల పరిధిలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

వట్టిచెరుకూరు మండలంలో..

వట్టిచెరుకూరు: ఎంఎల్‌సీ ఎన్నికలకు వట్టిచెరుకూరులోని జడ్పీ హైస్కూలుకు బుధవారం ప్రత్యేక వాహనంలో ఎన్నికల సామాగ్రితో అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. మండలవ్యాప్తంగా 1130 మంది పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వట్టిచెరుకూరు సీఐ రమా నాయక్ పర్యవేక్షణలో ఎస్ఐ సుబ్బారావు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



తాడేపల్లి: పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు

కాకుమాను మండలంలో..

కాకుమాను: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాకుమాను జడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఏర్పాట్లను తహసీల్దార్ వెంకటస్వామి, పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడు: ఎమ్మెల్సీ ఎన్నిలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సిబ్బంది పోలింగ్‌కేంద్రాలకు చేరుకున్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో 258, 259 పోలింగ్ కేంద్రాలలో 1603 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం ఎన్నికల నేపథ్యంలో మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై మధుపవన్ తెలిపారు.

చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

మంగళగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రబడ్జెట్‌లో చేనేతరంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కే శివదుర్గారావు, పీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. చేనేతపరిశ్రమ కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించి దెబ్బతీసిందని, రాష్ట్ర ప్రభుత్వం నేతన్ననేస్తం పథకాన్ని షెడ్యు కార్మికులు, సహకార సంఘాల్లోని కార్మికులకు అమలుచేయకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, సహకార సంఘాలకు యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ రిబేటు బకాయిలు చెల్లించాలని, కార్మికులందరికీ నేతన్న నేస్తం వర్తింపజేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.

చిత్తుబొమ్మ ఆడుతున్న 16మంది అరెస్టు

తాడికొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చిత్తుబొమ్మ ఆడుతున్న 16 మంది వ్యక్తులను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టుచేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పొన్నెకల్లులో రాత్రివేళల్లో చిత్తుబొమ్మ ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడిచేసి 16మందిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.16,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారినికోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ వాసుచెప్పారు.

తాడికొండ నియోజకవర్గంలో 11 పోలింగ్ కేంద్రాలు

● ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● ఓటు హక్కు వినియోగించుకోనున్న 8716మంది ఓటర్లు

తాడికొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం సాయంత్రానికి సిబ్బంది ఎన్నికల సామాగ్రితో ఆయా పోలింగ్‌బూత్‌లకు చేరుకున్నారు. తాడికొండ నియోజకవర్గంలోని తాడికొండ, మేడికొండూరు, తుళ్లూరు, ఫిరంగిపురం మండలాల్లో 11 బూత్‌ల్లో 8716 ఓటర్లు ఉన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనున్నది. తాడికొండలోని ఎస్‌వీవీ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్‌కేంద్రాలను గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు పరిశీలించారు.



తాడికొండలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న గుంటూరు ఆర్‌డీవో కే.శ్రీనివాసరావు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

తుళ్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. మండలంలో మొత్తం 2,800 ఓటర్లున్నారు. వారందరూ తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 3 పోలింగ్ బూత్‌లలో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లుచేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఎన్జీ రంగా సమాధిని పరిరక్షించాలి: కొల్లా

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, రైతుజన బాంధవుడు, ఎన్జీ రంగాకు ఢిల్లీలో నిర్మించిన సమాధిని సంరక్షించాలని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి బుధవారం డిమాండ్ చేశారు. ఎన్జీ రంగా దేశ చరిత్రలోనే ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ విముక్తి కోసం పోరాడిన దేశ భక్తుడు ఎన్జీ రంగా అన్నారు. ఇలాంటి సమరయోధుల స్మృతి చిహ్నాలను కబ్జా కోరుల నుంచి కేంద్ర ప్రభుత్వం రక్షించాలని కొల్లా డిమాండ్ చేశారు. ఆచార్య ఎన్జీ రంగా జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పొన్నూరులో ఎన్జీ రంగా విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేసి, నివాళులు అర్పించారు.







క్వారీ వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలు, కిటకిటలాడిన క్వారీలోని బాలకోటేశ్వరుని ఆలయ ప్రాంగణం, తిరునాళ్లలో ఏర్పాటుచేసిన ప్రభలు

హరోం.. హర...

● వైభవంగా మహా శివరాత్రి పూజలు
● కిట కిటలాడిన శివాలయాలు
● పెద్ద ఎత్తున ప్రభల ఏర్పాటు



బాలకోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల దంపతులు



పెదకాకానిలో దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం బుధవారం శివనామస్మరణతో మార్మోగింది. శివరాత్రి సందర్భంగా అర్ధరాత్రి నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. హరోం.. హర.., హర హర మహదేవ, శంభో శంకర, ఓం నమః శివాయ అంటూ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాలతో పాటు తెనాలి, గుంటూరు, పొన్నూరు, పరిసరప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. లక్షలాది మంది భక్త జనం ఉత్సవాలకు విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్త జనులతో కిక్కిరిసిపోయింది. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు ఆలయానికి విచ్చేసి స్వామి వారికి వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలలో పాల్గొన్నారు. క్వారీ బాలకోటేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలకు భక్తులు నిర్మించిన భారీ విద్యుత్ ప్రభలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు గ్రామాలకు చెందిన ఏడు భారీ విద్యుత్ ప్రభలు 80 అడుగల మేర నిర్మించారు. ప్రభలు ఉత్సవం సజావుగా సాగేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయానికి ప్రభలు చేరుకునే సరికి క్వారీ దేవాలయం వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. బాలకోటేశ్వరస్వామి ఉత్సవాలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందం బందోబస్తు నిర్వహించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలను విజయవంతం చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా పొటేళ్ల ప్రభ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టెంపూడి సంగమేశ్వరస్వామికి నిర్మించిన పొటేళ్ల ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని తెలగపాలెంకు చెందిన బోడి రామారావు ప్రతి ఏటా పొటేళ్ల ప్రభను నిర్మించి కట్టెంపూడి ఆలయానికి తీసుకువెళ్లడం ఆనవాయితీ. బుధవారం పొటేళ్లతో ప్రత్యేకంగా బండిని రూపొందించి విద్యుత్ ప్రభను నిర్మించి ఆలయానికి తీసుకువెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తజనం పొట్టేళ్ల ప్రభను ఆసక్తి తిలకించారు.

● పొన్నూరు టౌన్: మండల పరిధిలోని కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామ శివారులోని సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామవాసులు నిర్మించే భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయం వద్ద మూల విరాట్‌కు ఉదయం నిర్వహించిన పంచామృత అభిషేక పూజలలో స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

సహస్ర లింగేశ్వరస్వామి నిజరూప దర్శనం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడుగున చందన లేపనంతో దర్శనమిచ్చే సహస్ర లింగేశ్వరస్వామి నిజరూప దర్శనం మహా శివరాత్రి సందర్భంగా బుధవారం భక్తులకు సాక్షాత్కరించింది. పొన్నూరు పట్టణంలోని సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. స్వామివారి మూలవిరాట్‌కు ఏడాది పొడవునా చందన లేపనంచేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఒక్క శివరాత్రి పర్వదినం రోజు మాత్రమే స్వామివారి చందన లేపనం తొలగించి మంత్ర జలాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి , పాత పొన్నూరు బాలకోటేశ్వరస్వామి, నిడుబ్రోలు చౌడేశ్వరస్వామి, చింతలపూడి మల్లేశ్వరస్వామి, ములుకుదురు రామలింగేశ్వర స్వామి, వల్లభరావుపాలెం ఓంకారేశ్వరస్వామి, మామిళ్లపల్లి అగస్తేశ్వర స్వామి తదితర ఆలయాలలో మహా శివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి.

తెనాలి పట్టణంలో...

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాలలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామేశ్వరస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. రావణాబ్రహ్మ వాహనసేవ నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలాభిషేకం చేశారు. అనంతరం ఎదురు కోలోత్సవం, కల్యాణం కన్నుల పండువగా చేశారు. ఈవో రమణకుమారి, అర్చకులు సురేష్ పర్యవేక్షించారు. మారీసుపేటలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. చండీ హోమం, స్వామి వారి శాంతి కల్యాణం, లింగోద్భవ కాల పూజలు ఘనంగా నిర్వహించారు.

● తెనాలి రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ప్రసిద్ధి చెందిన బాలా త్రిపురసుందరీసమేత సంగమేశ్వరస్వామి వారి ఆలయం భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. బుధవారం తెల్లవారుజామునుంచే స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి రావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి.



పొట్టేళ్లతో ప్రభను తీసుకువస్తున్న భక్తులు

● మండలంలోని నందివెలుగు అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కొలకలూరులో శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ అగస్తేశ్వరస్వామి వారి ఆలయంలో శివరాత్రి మహోత్సవ పూజలు, అభిషేక పూజలు జరిపారు.

పెదకాకానిలో...

పెదకాకాని, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఓం నమఃశివాయ..... హర హర మహాదేవ...... శంభో శంకర అంటూ పెదకాకాని పురవీధులు మారుమోగాయి...... మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెదకాకాని మల్లన్నను వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు అభిషేక పూజలు జరిపించి, అక్కడినుంచి కేవలం దర్శనం మాత్రమే భక్తులు కల్పించారు. దీంతో భక్తులు ఇబ్బంది పడకుండా ప్రశాంతంగా మల్లేశ్వరస్వామి వారి, భ్రమరాంబ అమ్మవార్ల దర్శన భాగ్యం కలిగింది. ఉచిత దర్శనానికి భక్తులు ఆలయం బయట మెయిన్ రోడ్డు వరకు బారులు తీరారు. ఆలయ ఈవో, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ పర్యవేక్షణలో భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించారు. క్యూలైన్లో భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, తాగునీటి సదుపాయాన్ని కల్పించారు.

వైభవంగా స్వామివారి గ్రామోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభయ దేవి సమేత కాకాని మల్లేశ్వరుడు పెదకాకాని పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయం నుంచి బయలుదేరిన రథం పెదకాకానిలోని జాతీయ రహదారి మీదుగా అనేక ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిచ్చి, తిరిగి ఆలయానికి చేరుకున్నారు. దేవస్థానానికి చెందిన వేదపారాయణదారులు స్వామివారి బ్రహ్మోత్సవానికి ముందు నిలిచి వేదమంత్రాలతో రథోత్సవం నడిపించారు.

ఆలయాన్ని దర్శించిన ప్రముఖులు

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని బుధవారం అనేకమంది ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయాన్ని దర్శించిన వారిలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కుమార్, హైకోర్టు జడ్జిలు జస్టిస్ గుణరంజన్, జస్టిస్ హరిహరనాథశర్మ, అనేకమంది గుంటూరు, ఇతర జిల్లాల జడ్జీలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

● కొల్లిపర: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జామున శివసన్నిధిలో సుప్రభాతసేవ, వివిధ అభిషేకాలు భక్తులతో అర్చకులు పూజలు జరిపించారు. మున్నంగి భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని వల్లభాపురం, తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, దావులూరు, చివలూరు, సిరిపురం, అత్తోట, దంతలూరు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొల్లిపర శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని రంగ, రంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



రావణ బ్రహ్మ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



పాత శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి మనోహర్



పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, భాష్యం ప్రవీణ్ కుమార్

రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి: మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుని కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ పర్వత వర్ధని సమేత శ్రీ రామేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో జరుగుతున్న పూజాకార్యక్రమాల్లో మంత్రి మనోహర్ పాల్గొన్నారు. మండలంలోని సంగం జాగర్లమూడి శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ సంగమేశ్వరస్వామి వారి ఆలయాన్ని మంత్రి మనోహర్ దర్శించుకున్నారు. బుధవారం స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి, మహాశివరాత్రి పూజల్లో పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

తెనాలి క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎదురఎదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్న కుటుంబాల మహిళల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదంతో వారి భర్తలు కత్తులతో దాడి చేసుకున్న ఘటన బుధవారం రాత్రి స్థానిక వైకుంఠపురం ప్రాంతంలో జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దేవరకొండ నాగరాజు, చేపల శ్రీను ఎదురెదురు ఇళ్లలో నివాసం ఉంటున్నారు. వీరి భార్యల మధ్య స్వల్ప వివాదం ఏర్పడింది. భర్తలు కలుగ చేసుకొని చేపల శ్రీను కత్తితో దేవరకొండ నాగరాజుపై దాడి చేశాడు. నాగరాజుకు బలమైన గాయాలవటంతో కుటుంబసభ్యులు వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్య నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ముస్లింల సంక్షేమానికి పాటుపడాలి: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ కమిటీ ముస్లిం సంక్షేమానికి పాటుపడాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలో నూతన అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన న్యాయవాది మగ్బుల్‌బేగ్ బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. తన నియామకానికి సహకరించిన నరేంద్రకుమార్‌కు మగ్బుల్ బేగ్ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే సూచనలు మేరకు పొన్నూరు పరిసర ప్రాంతాల్లోని ముస్లిం సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా పాటుపడతానన్నారు. నూతన అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ బాజీ, పఠాన్ అహ్మద్‌ఖాన్, ఫిరోజ్‌ఖాన్, బాజీ సాహెబ్, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని భావన్నారాయణ స్వామి దేవాలయ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

● తెనాలి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 23,356
● మొత్తం 29 పోలింగ్ స్టేషన్‌లు



పొన్నూరులో ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ జియావుల్‌హక్, కమిషనర్ రమేష్ బాబు

తెనాలి, ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. తెనాలి నియోజకవర్గంలో దీనికోసం మొత్తం 29 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కావలసిన సదుపాయాలను కల్పించారు. తెనాలి నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాల్లో మొత్తం 23,356 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుంటే, వారిలో పురుషులు 11,699, మహిళలు 9,076 మంది ఉన్నారు. ఇతరులు కూడా ఇతరుల కింద మరో రెండు ఓట్లున్నాయి. ఈ మేరకు పోలింగ్ కేత్రాల్లోని ఏర్పాట్లను తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శేషన్నలు పరిశీలించారు. పోలీసులు, ఇతర సిబ్బందికి సూచనలు చేశారు. ఓటర్లు కూడా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడా అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామని వివరించారు. తెనాలి పట్టణం, రూరల్ మండలంలోని ఏడు ప్రాంతాలలో 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎవరికీ ఇబ్బంది ఉండదన్నారు. ఓటు విలువను గుర్తుంచుకుని ప్రతి ఓటరు ఓటు వసేందుకు రావాలని తహసీల్దార్ గోపాలకృష్ణ కోరారు. అయితే మార్చి 5 వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులుగా కానీ, ప్రదర్శనలకు కానీ అనుమతి లేదని డీఎస్పీ జనార్ధనరావు హెచ్చరించారు.

● తెనాలి అర్బన్ (ఆంధ్రజ్యోతి) : పట్టణం లో 26 పోలింగ్ కేంద్రాల్లో 20 వేల 777 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం నుంచి అన్ని మార్గాల్లో 100 మీటర్ల వరకు ఎలాంటి ప్రచారాలు నిర్వహించకుండా పోలీసులు మార్కింగ్ చేసి బారికేడ్లను ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి ఎన్నికల సామగ్రిని అందుకుని సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పరిశీలన

పొన్నూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగే పోలింగ్ కోసం ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. నిడుబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 263,264, పోలింగ్ కేంద్రాలను బుధవారం అధికారులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144సెక్షన్ విధించారు. ఓటర్లు సజావుగా పోలింగ్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కలిగించడంతో పాటు, మౌలిక వసతులను సిద్ధం చేశారు. ఏర్పాట్లను తహసీల్దార్ జియావుల్ హక్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.

జోరుగా కోడి పందాలు

కొల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది మహా శివరాత్రి బందోబస్తులో ఉండటంతో పందెం రాయుళ్లు ఒక్కసారిగా రెచ్చిపోయారు. బుధవారం కొల్లూరుతో పాటు మండల పరిధిలోని కోటిపల్లి, చినపులివర్రు వెళ్లే రహదారులపై కోడిపందాల బరులు వెలిశాయి. కొల్లూరులో కరకట్ట దిగువున ఇటుక కల్లాల్లో, కోటిపల్లి వద్ద కల్లాల్లో పగలంతా పందాలు జోరుగా సాగాయి. అనంతవరంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి కోడి పందాలు వేసేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు. పోలీసులు బరి వద్దకు వస్తున్నారన్న సమాచారం అందడంతో పందేలు వేయకుండా నిలిపి వేశారు.

శరీర సౌష్టవ పోటీల్లో వంశీకి గోల్డ్ మెడల్



శరీర సౌష్టవాన్ని ప్రదర్శిస్తున్న వంశీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన శరీర సౌష్టవ పోటీల్లో తెనాలి క్రీడాకారుడు వంశీ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ పోటీల్లో యూనివర్సిటీ స్థాయిలో టైటిల్ విన్నర్‌గా నిలిచాడు. మార్చిలో జరగనున్న ఆలిండియా అంతర్ యూనివర్సిటీల పోటీలకు ఎంపికయ్యాడు. కేఎల్ యూనివర్శిటీ ప్రాతినిధ్యం వహించనున్నారు. తెనాలిలోని క్విక్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారుడు బుధవారం జరిగిన కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేశాడు. కోచ్ ఘట్టమనేని సాయిరేవతి, శివరామకృష్ణరాజు తదితరులు అభినందించారు.

ఆలయాలకు రూ.33.5 లక్షల విరాళం



రూ.33.5 లక్షలు విరాళంగా అందజేసిన కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తదితరులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండవరం గ్రామానికి చెందిన గోపిశెట్టి కోటేశ్వర రావు గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి రూ.33.50 లక్షల విరాళాన్ని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చేతులమీదగా అందజేశారు. గుండవరం గ్రామంలోని శివాలయం పునర్నిర్మాణం కోసం రూ.23,50,116, వేణుగోపాలస్వామి ఆలయ ధ్వజస్తంభానికి రూ.5లక్షలు, గ్రామ ప్రభ రథం నిర్మాణం కోసం రూ.5లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా గోపిశెట్టి కోటేశ్వరరావును ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఘనంగా సత్కరించారు.

డీవీసీ చిత్రపటానికి పాలాభిషేకం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి వల్లభరావుపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంకు అధ్యక్షుడిగా ఎన్నికై 48 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం గ్రామ రైతులు, టీడీపీ నాయకుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాల సొసైటీ వద్ద వీరయ్య చౌదరి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు.